సాక్షి నిర్మల్

శనివారం । 2 । సెప్టెంబర్ । 2023



ఆర్టీసీకి 'రాఖీ' పండుగ

నష్టాల్లో ఉన్న ఆర్టీసీకి రాఖీ పండుగ కలిసొచ్చింది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు తిప్పడంతో సంస్థ లక్ష్యానికి మించి ఆదాయం సమకూరింది. 8లో▸



చెక్‌డ్యాంలతో జలసవ్వడి

జిల్లాలోని చెక్‌డ్యాంలు జలకళను సంతరించుకున్నాయి. ప్రభుత్వం మొదటి విడతలో 19 నిర్మించగా, రెండో విడతలో మరో 21 నిర్మాణాలు చేపట్టనుంది. 9లో▸

గరిష్టం/కనిష్టం
33.0 /24.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో పలుచోట్ల జల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

కళాశాల ఆకస్మిక తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న విజేశ్‌కుమార్

ముధోల్: మండల కేంద్రంలోని టీటీడబ్ల్యూఆర్‌ఎస్ గురుకుల కళాశాలను నిర్మల్ న్యాయమూర్తి విజేశ్‌కుమార్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కళాశాలలోని వసతులు, తరగతులు, పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు.

న్యాయవాదుల నిరసన



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ఖానాపూర్: ఉత్తరప్రదేశ్‌లోని హపూర్‌లో న్యాయవాదులపై జరిగిన లాఠీచార్జికి నిరసనగా ఖానాపూర్ కోర్టులో శుక్రవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ.. న్యాయవాదులపై లాఠీచార్జికి బాధ్యులైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, న్యాయవాదుల సంరక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సురేశ్, న్యాయవాదులు వెంకటమహేంద్ర, ఆసిఫ్, శివ, షబ్బీర్, రాజలింగం తదితరులున్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నిర్మల్ రూరల్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని శుక్రవారం మధ్యాహ్న భోజన సమయంలో కలెక్టరేట్‌లో జాక్టో ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కొత్త పెన్షన్ విధానంతో లక్షలాదిమంది ఉద్యోగులకు నష్టం జరుగుతుందని తెలిపారు. వెంటనే దానిని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. టీడబ్ల్యూటీయూ అధ్యక్షుడు డీవీ రావు, ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జుట్టు గజేందర్, నాంపల్లి నాగభూషణ్, టీఎస్ సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే కృష్ణారావు, భూమన్న, లక్ష్మణ్, రేవంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



బహుమతి అందుకున్న విద్యార్థులు

నిర్మల్‌చైన్‌గేట్: ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని జిల్లా ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణంలోని మంజులాపూర్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ యువజన దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రథమ బహుమతి సాధించిన మోక్ష, హర్షితకు రూ.వెయ్యి, ద్వితీయ బహుమతి పొందిన నవీన్, రాముకు రూ.750, తృతీయ బహుమతి సాధించిన జాగృతి, అక్షయకు రూ.500 నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ.. వ్యాధిపై అవగాహన పెంచుకుని జాగ్రత్తలు పాటిస్తే హెచ్ఐవి దరి చేరదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సిద్ధ పద్మ ఉపాధ్యాయులు రాజశేఖర్, అంబాజీ, నరేందర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కౌన్సిలర్



మంత్రికి మొక్క ఇస్తున్న కౌన్సిలర్ ఇమ్రాన్

నిర్మల్‌టౌన్: ఇటీవల కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన జిల్లా కేంద్రంలోని గాజులపేట్ కౌన్సిలర్ ఇమ్రాన్ ఉల్లా శుక్రవారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని హైదరాబాద్‌లోని సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. కాలనీ అభివృద్ధికి తన అనుచరులతో త్వరలో బీఆర్‌ఎస్‌లో చేరుతానని, మంత్రి హయాంలో నిర్మల్ ఎంతో అభివృద్ధి చెందుతోందన్నారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, మాజీ చైర్మన్ అప్పాల గణేశ్ ఉన్నారు.

రెగ్యులరైజ్ లొల్లి..

- హక్కుల సాధనకు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమ్మెబాట
- క్రమబద్ధీకరించాలని డిమాండ్
- ఇప్పటికే సమ్మెలో రెండో ఏఎన్‌ఎంలు
- నేటి నుంచి ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు..
- 11వ తేదీ నుంచి అంగన్‌వాడీలు..
- కుంటుపడనున్న ప్రజారోగ్య వ్యవస్థ



కలెక్టర్‌కు నోటీస్ ఇస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



సమ్మెకు సిద్ధమంటున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు

నిర్మల్‌చైన్‌గేట్: ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆయా ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు హక్కుల సాధనకు పోరుబాట పడుతున్నారు. ఇదే సరైన సమయమని భావించి రెండు నెలలుగా తరచూ రోడ్డెక్కి డిమాండ్లు నెరవేర్చాలని గళం వినిపిస్తున్నారు. దీంతో జిల్లా కేంద్రంలో నిత్యం ధర్నాలు, ర్యాలీలు జరుగుతూనే ఉన్నాయి. కలెక్టరేట్ ఎదుట నిత్యం నిరసన గళాలు వినిపిస్తూనే ఉన్నాయి.

ప్రభుత్వ హామీ మేరకే..

రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ వస్తోంది. నాలుగు నెలల క్రితం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసింది. ఆ తరువాత మెప్మాలో పని చేసే కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించింది. ఎన్నో ఏళ్లుగా పేస్కేల్ కావాలంటూ పోరాటం చేస్తున్న వీఆర్‌ఏలను కూడా ఇతర శాఖల్లోకి సర్దుబాటు చేసింది. ఎవరూ ఊహించని విధంగా ఆర్టీసీ ఉద్యోగులనూ ప్రభుత్వంలో విలీనం చేసుకుంది. ఇలా పలు శాఖల్లో పనిచేస్తున్న సిబ్బందిపై ప్రభుత్వం సానుకూలత ప్రదర్శిస్తుండడంతో మిగతా శాఖల్లోని కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తమకూ న్యాయం చేయాలని ఆందోళనలు ప్రారంభించారు.

26 రోజులుగా రెండో ఏఎన్‌ఎంలు

పనికి తగిన వేతనంతోపాటు ఉన్నతాధికారుల వేధింపులు మానుకోవాలని, బయోమెట్రిక్ హాజరు విధానాన్ని రద్దు చేయాలంటూ జిల్లా వ్యాప్తంగా 220మంది రెండో ఏఎన్‌ఎంలు 26 రోజులుగా సమ్మె చేస్తున్నారు. నిత్యం ఆర్డీవో కార్యాలయం వద్ద వినూత్న రీతిలో నిరసన తెలుపుతున్నారు. గురువారం సీఎం కేసీఆర్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు చిత్రపటాలకు రాఖీ కట్టి నిరసన తెలిపారు. ఎన్నికల సమయం కావడంతో ప్రభుత్వం తమ డిమాండ్లు నెరవేరుస్తుందనే నమ్మకంతో పోరాటం కొనసాగిస్తున్నారు.

11నుంచి అంగన్‌వాడీలు..

సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, లేకుంటే ఈనెల 11నుంచి రాష్ట్ర వ్యాప్త సమ్మె చేపట్టనున్నట్లు అంగన్‌వాడీ ఉద్యోగులు తెలిపారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ, ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో గురువారం ప్రాజెక్ట్ డైరెక్టర్, కలెక్టర్‌కు సమ్మె నోటీసులు అందించారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులు కూడా..

జిల్లాలోని సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు ఆగస్టు 29నుంచి సమ్మెకు దిగారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు. వీరి సమ్మె కారణంగా మండల వనరుల కార్యాలయాల్లో పనులు ఆగిపోయాయి. దీంతో ఎంఈవోలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సివస్తోంది.

నోటీస్ ఇచ్చిన ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు

వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో వివిధ కేటగిరీల్లో నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రామ్ ద్వారా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు రెగ్యులరైజ్ చేయాలని శనివారం నుంచి జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మెకు దిగనున్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులకు శుక్రవారం సమ్మె నోటీస్ అందజేశారు.

కుంటుపడనున్న ప్రజారోగ్య వ్యవస్థ

ఓ వైపు రెండో ఏఎన్‌ఎంలు 26రోజులుగా నిరవధిక సమ్మెలో ఉండడంతో ఇటీవల వర్షాలు పడి జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభించి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. వీరికి వైద్యసేవలు నిర్ణీత సమయంలో అందడం లేదు. దీనికి తోడు వైద్యారోగ్యశాఖ పరిధిలో నేషనల్ హెల్త్ మిషన్‌లో విధులు నిర్వహిస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు శుక్రవారం నుంచి సమ్మెకు దిగడంతో వైద్యారోగ్యశాఖలో సేవలు నిలిచిపోనున్నాయి.

వెట్టిచాకిరీ చేయిస్తోంది



రెండు దశాబ్దాలుగా గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తున్నా ప్రభుత్వం గుర్తించడం లేదు. మాతో వెట్టి చాకిరీ చేయిస్తోంది. చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా మమ్మల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. – సుజాత, రెండో ఏఎన్‌ఎం

రెగ్యులరైజ్ చేయాలి



మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలి. 20 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నాం. క్రమబద్ధీకరిస్తామన్న సీఎం కేసీఆర్ మాట నిలుపుకోవాలి.

– రమణ, యునైటెడ్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రటరీ

ముగిసిన ట్రెయినీ ఐఏఎస్‌ల పర్యటన



పెంబి: సేంద్రియ ఎరువు తయారీ గురించి తెలుసుకుంటున్న ట్రెయినీ ఐఏఎస్‌లు

పెంబి: మండలంలో ట్రెయినీ ఐఏఎస్‌ల పర్యటన ముగిసింది. ఆదివారం ఇక్కడకు వచ్చిన వారు ఆరురోజులుగా పలు గిరిజన గ్రామాల్లో పర్యటించారు. ఇక్కడి సమస్యలు, సంప్రదాయాలు తెలుసుకున్నారు. శుక్రవారం ఉదయం మండల కేంద్రంలోని పల్లె ప్రకృతి వనం, వైకుంఠధామం, సెగ్రిగేషన్ షెడ్డు, హరితహారం నర్సరీలను పరిశీలించారు. సర్పంచ్ పూర్ణచందర్‌గౌడ్‌తో పాటు పలువురు వారిని సన్మానించారు. శనివారం ఉదయం జిల్లా కేంద్రానికి వెళ్లనున్నట్లు ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఎంపీవో రత్నాకర్‌రావు, ఐకేపీ, పంచాయతీరాజ్ సిబ్బంది ఉన్నారు.

దస్తురాబాద్ మండలంలో..

దస్తురాబాద్: మండలంలోని గోడిసీర్యాల గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను శుక్రవారం ట్రెయినీ ఐఏఎస్‌లు పరిశీలించారు. విద్యార్థుల లక్ష్యాలు తెలుసుకుని పలు సూచనలు చేశారు. అనంతరం పాఠశాలలో గ్రామాభివృద్ధి కమిటీతో చేపట్టిన అదనపు గదుల నిర్మాణం, డిజిటల్ క్లాస్‌రూం పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యాకమిటీ చైర్మన్ రాజేందర్‌ను అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు మల్లయ్య, ఉప సర్పంచ్ మాణిక్యరావ్, ఉపాధ్యాయులు వెంకటరాజం, రాజమణి, రాధిక, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఇక బదిలీలు, ప్రమోషన్లు

- హైకోర్టు స్టే ఎత్తేయడంతో ప్రక్రియ మరూ
- షెడ్యూల్ విడుదలతో టీచర్లలో ఆనందం
- వందలాది మందికి బదిలీలు, ప్రమోషన్లు



నిర్మల్ రూరల్/నిర్మల్‌ఖిల్లా: తెలంగాణలోని ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు హైకోర్టు శుభవార్త అందించింది. ఇన్నిరోజులూ మధ్యంతర ఉత్తర్వులతో స్టే కొనసాగిన ఉపాధ్యాయుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ తీర్పు వెల్లడించింది. టీచర్ల బదిలీలపై బుధవారం కోర్టు మధ్యంతర స్టే ఉత్తర్వులు సవరించింది. ఈ క్రమంలోనే టీచర్ యూనియన్ల నేతలకు అదనపు పాయింట్లు ఇవ్వకుండా బదిలీలకు అనుమతిచ్చింది. ఉపాధ్యాయ దంపతులకు మాత్రం అదనపు పాయింట్లు కేటాయించడానికి సమ్మతించింది. దీంతో జిల్లాలోని ఉపాధ్యాయులు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ ఇక సజావుగా పూర్తి కానుందని ఉపాధ్యాయులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

నాన్‌స్పౌజ్ ఉపాధ్యాయుల కేసుతో స్టే

గత జనవరిలోనే బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ ప్రారంభమై ఆన్‌లైన్‌లో షెడ్యూల్ కొనసాగుతుండగానే స్పౌజ్ ఉపాధ్యాయులు కోర్టు కేసు వేయడంతో ప్రక్రియ నిలిచింది. కాగా, ఉపాధ్యాయ దంపతులకు 10 పాయింట్లు అదనంగా కేటాయించడాన్ని సవాల్ చేస్తూ కోర్టుకెళ్లారు. దీంతో రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఫిబ్రవరిలో స్టే విధించింది. అప్పటి నుంచి పలు దఫాలుగా వాదనలు జరగగా ఇటీవల బుధవారం హైకోర్టు షరతులతో కూడిన గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ప్రక్రియ రేపటి నుంచి ప్రారంభం కానుంది. సెప్టెంబర్ 3 నుంచి ప్రారంభమయ్యే ప్రక్రియ అక్టోబర్ 3లోపు పూర్తి కానుంది. ప్రక్రియ సజావుగా పూర్తి చేసేందుకు జిల్లా విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. దరఖాస్తుల స్వీకరణ ఆన్‌లైన్‌లో చేపట్టగా ఆగిన ప్రక్రియ మళ్లీ ఈ నెలలో పూర్తి కానుంది. గతంలో జనవరిలో బదిలీలు ప్రమోషన్ల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించింది. అప్పట్లో కోర్టు స్టే విధించడంతో ప్రక్రియ నిలిచింది. అయితే అప్పటినుంచి ఇప్పటివరకు దాదాపు ఏడు నెలలు పూర్తవడంతో అప్లికేషన్లకు మళ్లీ ఎడిట్ అవకాశం ఇవ్వనున్నారు. దీంతో మరింతమంది అదనంగా బదిలీలకు దరఖాస్తు చేసుకోనున్నారు. జిల్లాలో ప్రభుత్వ, పంచాయతీరాజ్ అధీనంలోని అన్ని పాఠశాలల్లో అన్ని రకాల ఉపాధ్యాయ పోస్టులు కలిపి 2,958 మంజూరైన పోస్టులు ఉండగా ప్రస్తుతం 2,416 మంది పనిచేస్తున్నారు. ఉపాధ్యాయులకు గరిష్ఠంగా ఎనిమిదేళ్లు, హెచ్‌ఎంలకు ఐదేళ్ల సర్వీస్ పూర్తయితే తప్పనిసరిగా బదిలీ అవుతారు. కాగా, కనీసం రెండేళ్ల కాలం పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులంతా బదిలీలకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హత ఉంటుంది. ఎస్జీటీలుగా పనిచేస్తున్న వారు స్కూల్ అసిస్టెంట్లుగా, పీఎస్ హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్లు పీజీహెచ్‌ఎంలుగా ప్రమోషన్లకు అర్హులు కానున్నారు. ఈ స్థానాల్లో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్, పీఈటీ, భాషా పండితులు జిల్లాస్థాయి యూనిట్‌గా బదిలీలు ప్రమోషన్లు చేపడతారు. అలాగే పీజీహెచ్‌ఎం ఉపాధ్యాయులకు మల్టీజోన్ స్థాయిలో బదిలీలు, ప్రమోషన్లు ఉంటాయి. తాజాగా ఇందుకు సంబంధించిన ప్రక్రియ కోసం షెడ్యూల్ విడుదల చేశారు. గతంలో 2015లో ప్రమోషన్లు చేపట్టగా, 2018లో బదిలీలు నిర్వహించారు. నూతన జిల్లాలు ఏర్పడిన నుంచి ప్రమోషన్లు ఇవ్వడం ఇదే తొలిసారి కానుంది. బదిలీలు, ప్రమోషన్లకు సెప్టెంబర్ ఒకటో తేదీని కటాఫ్ తేదీగా నిర్ణయించి షెడ్యూల్‌లో పొందుపరిచినట్లు జిల్లా అధికారులు వెల్లడిస్తున్నారు.

పోస్టు రకం	మంజూరైన పోస్టులు	పనిచేస్తున్న వారిసంఖ్య	ఖాళీల సంఖ్య
పీఎస్ హెచ్‌ఎం	79	29	50
ఎస్‌ఏ (అన్నీ కలిపి)	1,026	847	179
పీజీ హెచ్‌ఎం	107	48	59
భాషాపండిత్ (అన్నీ)	215	211	04
పీఈటీ	39	35	04
ఎస్జీటీ	1,478	1243	235

ఖాళీల వివరాలు

జిల్లాలోని మొత్తం పోస్టులు	2,958
ప్రస్తుతం పని చేస్తున్నవారు	2,416
ఖాళీగా ఉన్న స్థానాలు	542
మొత్తం పాఠశాలల సంఖ్య	737
ప్రాథమిక పాఠశాలలు	535
ప్రాథమికోన్నత పాఠశాలలు	85
ఉన్నత పాఠశాలలు	117

సజావుగా పూర్తి చేస్తాం



జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నాం. ఈనెల 3నుంచి నెలలోపు పూర్తిచేసేలా పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేసింది. ఆ మేరకు దరఖాస్తుల స్వీకరణ మొదలుకొని ఉపాధ్యాయులు నూతన పాఠశాలల్లో జాయిన్ అయ్యే దాకా ప్రక్రియను పారదర్శకంగా పూర్తిచేస్తాం.

– రవీందర్‌రెడ్డి, డీఈవో

బదిలీల షెడ్యూల్ ఇలా..

ఈనెల 3నుంచి 5వ తేదీ వరకు జిల్లాలో పనిచేస్తున్న అర్హులైన ఉపాధ్యాయులు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అందించాలి. 6, 7 తేదీల్లో దరఖాస్తు కాపీలను డీఈవో కార్యాలయంలో అందజేయాలి. అనంతరం 8, 9 తేదీల్లో వారి వివరాలు వెబ్‌సైట్‌లో ప్రదర్శిస్తారు. అనంతరం అభ్యంతరాలు స్వీకరించి 12, 13 తేదీల్లో సీనియారిటీ జాబితాలు వెల్లడిస్తారు. 14వ తేదీన ఎడిట్ చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. తొలుత 15వ తేదీన ఆన్‌లైన్ ద్వారా ప్రధానోపాధ్యాయుల బదిలీలు ఉంటాయి. అనంతరం 16న ప్రధానోపాధ్యాయుల ఖాళీల జాబితా ప్రదర్శిస్తారు. 17, 18, 19 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్ నుంచి పీజీ హెచ్‌ఎంలుగా పదోన్నతులు ఉంటాయి. 20, 21 తేదీల్లో ఖాళీ అయిన స్కూల్ అసిస్టెంట్ స్థానాలను ప్రదర్శిస్తారు. 21న వెబ్ ఆప్షన్లు స్వీకరించి 23, 24 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్ బదిలీలు చేపడతారు. అనంతరం 24న స్కూల్ అసిస్టెంట్ ఖాళీల ప్రదర్శన ఉంటుంది. 26, 27, 28 తేదీల్లో ఎస్జీటీ స్థాయి నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతులు చేపడతారు. తదుపరి 29, 30, 31 తేదీల్లో ఎస్జీటీ స్థానాల ఖాళీలు వెబ్‌సైట్‌లో ప్రదర్శిస్తారు. అక్టోబర్ 2న ఎడిట్ ఆప్షన్‌కు అవకాశం ఉంటుంది. అక్టోబర్ 3న ఎస్జీటీలు, భాషా పండితులు, పీఈటీల బదిలీలు నిర్వహిస్తారు. దీంతో అన్ని రకాల ఉపాధ్యాయుల బదిలీల ప్రమోషన్ల ప్రక్రియ పూర్తవుతుంది. అక్టోబర్ 5 నుంచి 19తేదీ వరకు అభ్యంతరాలపై అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుంది.

‘గిరిజన ఎమ్మెల్యేలే అవినీతి పరులా?’



సమావేశంలో మాట్లాడుతున్న రాములునాయక్

కడెం: రాష్ట్రంలో గిరిజన ఎమ్మెల్యేలే అవినీతి పరులా? అని మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శుక్రవారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అగ్రకులాలకు టికెట్లు కేటాయించిన బీఆర్‌ఎస్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు రేఖానాయక్, సక్కు, బాపురావును ఎందుకు పక్కన పెట్టారని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ ఉద్యమకారులను అణిచివేసి ద్రోహులను అక్కున చేర్చుకుంటున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థుల జాబితాలోని 105 మందిలో ఎన్నికలకు ముందు 40 మందిని మార్చడం ఖాయమని తెలిపారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రానుందని ధీమా వ్యక్తం చేశారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు, నాయకులు చంద్రశేఖర్, మల్లేశ్, భూషణం, చాంద్‌పాషా, రాజన్న, ధర్మయ్య తదితరులున్నారు.

మహలింగిలో పారాయణ యజ్ఞం



ప్రవచిస్తున్న దుర్గాప్రసాద్ స్వామి

తానూరు: మండలంలోని మహలింగి గ్రామంలో గురువారం రాత్రి పరమపూజ్య దుర్గాప్రసాద్‌స్వామి ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణ యజ్ఞం నిర్వహించారు. ముందుగా మహిళలు మంగళహారతులతో వీధుల్లో శోభాయాత్ర చేపట్టారు. అనంతరం గ్రామంలోని కల్యాణ మండపంలో స్వామి ప్రవచనాలు చేశారు. చెడువ్యసనాలు వీడి భక్తి మార్గంలో పయనించాలని, భగవంతుడి నామ స్మరణ చేయాలని సూచించారు. సర్పంచ్ రత్నబాయి, ఎంపీటీసీ సభ్యురాలు వందన ఉన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న స్వామి

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారిని దుర్గప్రసాద్ స్వామి శుక్రవారం దర్శించుకున్నారు. ముందుగా అర్చకులు, వైదిక బృందం ఆలయ మర్యాదలతో స్వామికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఖానాపూర్‌కు అర్బన్ పీహెచ్‌సీ మంజూరు

ఖానాపూర్: ఖానాపూర్ పట్టణానికి అర్బన్ పీహెచ్‌సీ మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాల్టీలకు 24 మంజూరు కాగా, ఒక్కో యూపీహెచ్‌సీకి రూ.1.43కోట్లను 15వ ఫైనాన్స్ కమిషన్ నిధుల నుంచి మంజూరు చేయనున్నారు. ఖానాపూర్ పట్టణానికి అర్బన్ పీహెచ్‌సీ మంజూరు కావడంతో పట్టణవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, జిల్లాకేంద్రంలోని ఆస్పత్రిని ఇప్పటికే ప్రభుత్వం మెడికల్ కాలేజీగా మార్చారు. దీంతో భైంసాలోని ఏరియా ఆస్పత్రిని జిల్లా ఆస్పత్రిగా, ఖానాపూర్ ఆస్పత్రిని ఏరియా ఆస్పత్రిగా మార్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో జిల్లా పరిధిలో వైద్యసేవలు మరింత మెరుగుపడనుండగా ప్రజలు హర్షం వ్యక్తంజేస్తున్నారు. అర్బన్ పీహెచ్‌సీల్లో పీహెచ్‌సీల తరహాలోనే వైద్యాధికారులు, సిబ్బంది సేవలందిస్తారని డీఎంహెచ్‌వో ధన్‌రాజ్ తెలిపారు. ఇది 12గంటల పాటు వైద్యసేవలు అందిస్తుందని వివరించారు.

నేడు సర్టిఫికెట్ల పరిశీలన

నిర్మల్ రూరల్: జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీల భర్తీకి శనివారం అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని డీఈవో రవీందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. గత నెలలో విడుదల చేసిన 2023 మెరిట్ లిస్ట్ నుంచి, గత నెలలో ఎంపికైనవారు పోగా మిగతా మెరిట్‌లిస్ట్ నుంచి రోస్టర్ కం మెరిట్ ప్రకారం 1:3లో ఎంపిక చేసి ధ్రువీకరణ పత్రాలను డీఈవో కార్యాలయంలో శనివారం ఉదయం 10గంటల నుంచి పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు ఒకజత జిరాక్స్ కాపీలు తీసుకుని హాజరుకావాలని తెలిపారు. 2023 నోటిఫికేషన్‌లో మెరిట్ సాధించిన అభ్యర్థుల జాబితా రెండేళ్లు కొనసాగడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. పాత జిల్లా విద్యాధికారి కార్యాలయంలో జాబితా అందుబాటులో ఉంచుతున్నామని వివరించారు.

మెగా డీఎస్సీ వేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ వేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వాగ్మారే మహేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థులు జిల్లా గ్రంథాలయంలో సీఎం క్యాంప్ ఆఫీస్‌కు ఉత్తరాలు రాసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇటీవల 5,089 పోస్టులతో వేసిన డీఎస్సీ నోటిఫికేషన్ రద్దు చేసి, గత అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించిన 13,089 పోస్టులతో పాటు ఉపాధ్యాయుల సర్దుబాటు అనంతరం మిగతా 9వేల పోస్టులు కలిపి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో అసెంబ్లీ ముట్టడికి పిలుపునిస్తామన్నారు. హైదరాబాద్‌లో శాంతియుతంగా ఆందోళన చేపట్టిన డీఎస్సీ అభ్యర్థులను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఖండించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్పాలే నవీన్, నాయకులు మున్నా, విలాస్, డీఎస్సీ అభ్యర్థులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

లోకేశ్వరం: గ్రామపంచాయతీల రికార్డులు సక్రమంగా నిర్వహించాలని డీపీవో శ్రీలత ఆదేశించారు. శుక్రవారం మండలంలోని గొడిసెరా గ్రామంలోని బృహత్ పల్లెప్రకృతివనం, మురుగుకాలువలు, గ్రామపంచాయతీ రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామంలోని రోడ్లు, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, రోడ్లపై నీరు నిల్వకుండా చూడాలని, హరితహారంలో మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. ఆమె వెంట గ్రామపంచాయతీ కార్యదర్శి గంగాధర్, అంగన్‌వాడీ కార్యకర్తలున్నారు.

పుస్తకపఠనం అలవర్చుకోవాలి



విద్యార్థులతో చదివిస్తున్న ఉపాధ్యాయులు

నిర్మల్ రూరల్: విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని జిల్లా సెక్టోరియల్ అధికారి నర్సయ్య సూచించారు. మండలంలోని అక్కాపూర్ పాఠశాలలో శుక్రవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో ‘రీడ్ ఏ థాన్’ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో ఒకే రోజు.. ఒకే సమయానికి ఎంపిక చేసిన 10పాఠశాలల్లో 921మంది విద్యార్థులు, 65మంది ఉపాధ్యాయులు, 105మంది తల్లిదండ్రులు, 28మంది ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. రూమ్ టూ రీడ్ సంస్థ సహకారంతో జిల్లా వ్యాప్తంగా గ్రంథాలయాలకు ఉచితంగా పుస్తకాలు సరఫరా చేస్తామని చెప్పారు. ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, రూమ్ టూ రీడ్ సంస్థ జిల్లా ఇన్‌చార్జి రవి, ఎస్‌ఎంసీ చైర్మన్ నగేశ్, ఉపాధ్యాయులు దేవిప్రియ, సురక్ష తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్‌రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రణదీవెనగర్‌కు చెందిన నివర్తి కాంబ్లే (45) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ముజాహిద్ కథనం ప్రకారం.. కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న ఆదిలాబాద్ పట్టణంలోని రణదీవెనగర్‌కు చెందిన కాంబ్లే నివర్తి మద్యానికి బానిసయ్యాడు. రాఖీ పండుగ సందర్భంగా భార్య కాంబ్లే లత పుట్టింటికి వెళ్లింది. ఇంట్లో ఎవరూలేని సమయంలో మద్యం మత్తులో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కుంటలో దూకి వృద్ధుడి ఆత్మహత్య

లోకేశ్వరం: మండలంలోని హవర్గ గ్రామానికి చెందిన జోగులే విఠల్(70) గ్రామ సమీపంలోని మామిడికుంటలో దూకి ఆత్మహత్య చేసున్నాడు. హెడ్‌కానిస్టేబుల్ రామారావు వివరాల ప్రకారం హవర్గ గ్రామంలోని జోగులే విఠల్ కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. రెండు రోజులుగా అనారోగ్యం తీవ్రం కావడంతో శుక్రవారం గ్రామ సమీపంలోని మామిడి కుంటలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య చంద్రవ్వ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

తలమడుగు: మండలంలోని రుయ్యాడి గ్రామానికి చెందిన సుధారపు రేణుక (60) రిమ్స్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం... తలమడుగు మండలంలోని రుయ్యాడి గ్రామానికి చెందిన రేణుక ఆగస్టు 24వ తేదీన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఆటోలో మహారాష్ట్రలోని మహోర్ గ్రామానికి వెళ్తుండగా మార్గం మధ్యలో ఉండం గ్రామ సమీపంలోని డంపింగ్ యార్డ్ వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో రేణుకకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై ధనశ్రీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

లక్ష్మణచాంద: మండలంలోని వడ్డెపెల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. పెంబి మండలంలోని వెంకంపోచంపాడ్ అనుబంధ గ్రామమైన గోదమల్లె గ్రామానికి చెందిన చెందిన సిడాం తుక్కారాం, సిక్కారాం సంబు ఇరువురు ద్విచక్రవాహనంపై శుక్రవారం గ్రామం నుంచి బ్యాంక్ పని నిమిత్తం ఖానాపూర్ వెళ్లారు. పనిముగింపుకొని ఇంటికి వెళ్లే క్రమంలో లక్ష్మణచాంద మండలంలోని వడ్డెపెల్లి వద్ద కుక్క అడ్డురావడంతో దానిని తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పి కింద పడ్డారు. దీంతో తుక్కారాంకు తీవ్ర గాయాలు కాగా సిక్కారాంకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మన్మద్‌లో మహారాష్ట్ర వలస కూలీ మృతి

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ గ్రామంలో మహారాష్ట్రలోని హిమయాత్‌నగర్ తాలుకలోని గణేష్‌నగర్ తండాకు చెందిన పవర్ రాజు (48) పురుగుల మందు తాగి శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై దిగంబర్ తెలిపిన వివరాలు ప్రకారం... మండలంలోని మన్మద్ గ్రామానికి గణేష్ నగర్ తండాకు పవర్‌రాజు బతుకుదెరువు కోసం మూడేళ్ల కింద వలస వచ్చాడు. అప్పటి నుంచి వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొన్ని రోజుల నుంచి మద్యానికి బానిసయ్యాడు. గురువారం మన్మద్ గ్రామంలో ఓ రైతుకు చెందిన చేనులోకి వ్యవసాయ పనుల నిమిత్తం కూలీ పనులకు వెళ్లాడు. అక్కడ మద్యం మత్తులో పురుగుల మందుతాగాడు. కుటుంబ సభ్యులు నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

అదుపుతప్పి ఆటో బోల్తా...

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బస్సు డిపో సమీపంలో ఆటో అదుపు తప్పి ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే... స్థానిక చైన్‌గేట్ నుంచి మంచిర్యాల చౌరస్తా వెళ్లే దారిలో ఆటో ఒక్కసారిగా అదుపుతప్పి ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొని బోల్తాపడింది. వెంటనే స్థానికులు ఆటోను పైకి లేపే సమయంలో గేర్‌లో ఉండడంతో మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. వెంటనే స్థానికులు ఆటోని ఆఫ్ చేసి పక్కకు తీసుకెళ్లారు. ఈ సంఘటనతో ఎవరికి ఎటువంటి హాని జరగలేదు.

ఆర్టీసీకి రాఖీ పండుగ..!

- టార్గెట్‌కు మించి ఆదాయం
- ఆదిలాబాద్ రీజియన్‌లో మంచిర్యాల నంబర్-1
- ఆదిలాబాద్ రీజియన్‌లో ఆదాయం రూ.1,42,35,601
- ఒక్కోరోజు ఆదాయం 126.24శాతం



ఆదిలాబాద్: నష్టాల్లోని ఆర్టీసీకి రాఖీ పండుగ కలిసొచ్చింది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను తిప్పటంతో అనుకున్న టార్గెట్‌కు మించి ఆదాయం సమకూరింది. రాఖీ పండుగ నేపథ్యంలో హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు పెరిగాయి. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా, ప్రయాణికుల సౌకర్యార్థం తెలంగాణ ఆర్టీసీ ఆదిలాబాద్ రీజియన్ నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌కు ఉద్యోగ రీత్యా వెళ్లినవారు.. చదువుల నిమిత్తం ఉన్న విద్యార్థులందరూ సొంత ఊళ్లకు వచ్చి వెళ్తుంటారు. ఈ నేపథ్యంలోనే ఆదిలాబాద్ రీజియన్ నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపింది. రోజువారీ బస్సుల కంటే అదనపు బస్సులను నడిపి ఆదాయం సమకూర్చుకుంది. రాఖీ పండుగ ఒక్కరోజు (గురువారం) ఆదిలాబాద్ రీజియన్‌లో రూ.1,12,76,453 ఆదాయ లక్ష్యసాధనకు రూ.1,42,35,601 సాధించింది. ఇందులో ఆరు డిపోల్లో మంచిర్యాల డిపోకు రూ.28,19,956 ఆదాయం టార్గెట్ విధించగా రూ.39,90,664 సాధించింది. రీజియనల్‌లో ముందు వరుసలో నిలచి ఫస్ట్ (నంబర్-1) స్థానం సాధించింది.

హైదరాబాద్ నుంచి ఎక్కువగా..

పండుగ నేపథ్యంలో జిల్లాకు అత్యధికంగా ప్రజలు హైదరాబాద్ నుంచి వస్తుంటారు. చదువు, ఉద్యోగంతో పాటు ఇతర అవసరాల నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లివస్తుంటారు. రాఖీ పండుగ నేపథ్యంలో రద్దీ ఎక్కువగా ఉన్న దృష్ట్యా ప్రత్యేక బస్సులకు కేటాయించిన ట్రిప్పులకు అదనంగా తిప్పేందుకు ప్రణాళిక రూపొందించారు. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచారు. దీంతో అనుకున్న దానికంటే ఎక్కువ ఆదాయం సమకూరింది. ఎక్కువగా బస్సులు తిప్పటంతో లక్ష్యసాధన వైపు పరుగులు పెట్టింది. ఆదిలాబాద్ రీజియన్‌లో రాఖీ పండుగ ఒక్కరోజు 2,49,474 కిలో మీటర్లకు 2,65,582 (106.46శాతం) బస్సులు తిరిగాయి. ఎర్నింగ్ ఫర్ కిలోమీటరు (ఈపీకే) 45.2 గాను 53.60(118.59శాతం) సాధించింది. ఆక్యుపెన్సీ రేషియో 71కి 84 (118-53శాతం), ఎర్నింగ్ ఫర్ బస్సు (ఈపీబీ) 23,261 సాధించి మునుపెన్నడూ లేని విధంగా ఆర్టీసీ లాభాల బాట పట్టింది.

రీజియన్ పరిధిలో వచ్చిన ఆదాయం (రూ.లక్షల్లో)..

తేదీ	ఆదిలాబాద్	భైంసా	నిర్మల్	ఉట్నూర్	ఆసిఫాబాద్	మంచిర్యాల	మొత్తం
ఆగస్టు 28న	22.46	12.48	27.35	4.2	14.21	30.07	110.77
29న	25.84	11.88	29.28	4.41	15.17	31.62	118.20
30న	27.33	14.26	31.41	5.10	17.42	36.12	131.64
31న	29.03	15.59	33.63	5.55	18.64	39.91	142.35

రీజియన్ పరిధిలో ఓఆర్ వివరాలు..

తేదీ	ఆదిలాబాద్	భైంసా	నిర్మల్	ఉట్నూర్	ఆసిఫాబాద్	మంచిర్యాల	మొత్తం
ఆగస్టు 28న	68	69	72	66	68	75	71
29న	70	64	71	72	79	78	73
30న	75	75	79	78	82	87	80
31న	79	77	83	83	85	93	84

మంచిర్యాల ఫస్ట్..

ఆదిలాబాద్ రీజియన్‌లో ఆరు డిపోలో మంచిర్యాల డిపో ఆదాయ లక్ష్యసాధనలో నెంబర్ వన్ స్థానంలో నిలిచింది. ప్రణాళిక ప్రకారం బస్సులు నడిపి అనుకున్న టార్గెట్‌ను మించిపోయింది. సాధారణ రోజుల్లో 60,895 కిలోమీటర్ల బస్సులు తిరగాల్సి ఉండగా పండుగ వేళ 66041 కిలోమీటర్లు తిప్పి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చారు. రూ.28,19,956 ఆదాయం గాను రూ.38,90664 సాధించి రీజియన్‌లో మొదటి స్థానం నిలిచింది. ఈపీకే 46.31గాను 60.43 సాధించినట్లు మంచిర్యాల డిపో మేనేజర్ రవీంద్రనాథ్ తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగుల సమిష్టి కృషితోనే అనుకున్న లక్ష్యసాధనకంటే మించి ఆదాయం వచ్చిందన్నారు.

అందరి కృషితోనే ఆదాయం



ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని ఉద్యోగులు, సిబ్బంది సమిష్టి కృషి ఫలితంగానే రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆదాయం సమకూరింది. ప్రయాణికులు అవస్థలు పడకుండా ఎప్పటికప్పుడు బస్సులను ఏర్పాటు చేశాం. గతంలో అదనపు చార్జీలు ఉండేవి. అయితే ప్రస్తుతం అదనపు సర్వీసులను నడుపుతూ మెరుగైన సేవలు అందజేస్తున్నాం.

– ప్రణీత్, డిప్యూటీ ఆర్‌ఎం (ఆపరేషన్స్)

మట్కా జూదరుల అరెస్టు

ఇచ్చోడ: మండలంలో సీసీఎస్ ఇన్స్‌పెక్టర్ సాయినాథ్ ఆధ్వర్యంలో శుక్రవారం మట్కా ఆడుతున్న నలుగురిని అరెస్టు చేశారు. ఇందులో ఇచ్చోడకు చెందిన హర్షద్‌ఖాన్, షేక్ షఫీ పట్టుబడ్డారు. భైంసాకు చెందిన అజీమ్, ఆదిలాబాద్‌లోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన మహ్మద్ లతీఫ్ పరారీలో ఉన్నట్లు ఇన్స్‌పెక్టర్ తెలిపారు. వారి నుంచి మట్కా చిటీలు, రూ.62,570 స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. సీసీఎస్ సిబ్బంది ఎస్సై లక్ష్మణ్, సిరాజ్ ఖాన్, శ్రీనివాస్, రాహత్, గంగారెడ్డి, జాకీర్ పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకుడిపై కేసు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలో మట్కా నిర్వహిస్తున్న ఒకరిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఉట్నూర్ ఎస్సై మనోహర్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన రామకృష్ణ మాట్కా ఆడుతుండగా పట్టుకుని అతడి వద్ద నుంచి రూ.2450, మట్కా చిట్టీలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఐదుగురికి జరిమానా

నిర్మల్‌టౌన్: మద్యం తాగి వాహనాలు నడిపిన ఐదుగురికి జరిమానా, ఒక్కొక్కరికి మూడు రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ నిర్మల్ న్యాయస్థానం తీర్పు ఇచ్చినట్లు పట్టణ ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. మద్యం మత్తులో వాహనం నడుపుతూ పలువురు పట్టుబడగా వారిని నిర్మల్ కోర్టులో హాజరు పరిచారు. ఐదుగురికి రూ.4600 జరిమానా విధిస్తూ ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

బైకులు పట్టివేత..

జిల్లా కేంద్రంలో షోరూం నుంచి వచ్చిన సైలెన్సర్ కాకుండా మాడిఫైడ్ సైలెన్సర్ పెట్టుకుని ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న బైకులను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సైలు దేవేందర్, రాజశేఖర్ మాట్లాడుతూ.. డీఎస్పీ గంగారెడ్డి ఆదేశాల ప్రకారం జిల్లా కేంద్రంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. షోరూం నుంచి వచ్చిన సైలెన్సర్లు కాకుండా బైక్‌కు అధిక సౌండ్ వచ్చే సైలెన్సర్లను బిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తీరనున్న రవాణా కష్టాలు



బ్రిడ్జి కింద వాగుపై కొనసాగుతున్న తాత్కాలిక వంతెన పనులు

- జోగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాత్కాలిక వంతెన
- తరోడ వాగుపై నిర్మాణ పనులు
- సుమారు రూ.40లక్షల అంచనా వ్యయం

జైనథ్: తరోడ బ్రిడ్జి కుంగిపోవడంతో గత ఆరు నెలలుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జైనథ్, బేల మండలాలతో పాటు మహారాష్ట్రను ఆదిలాబాద్‌తో కలిపే జాతీయ రహదారి ఉన్న బ్రిడ్జి కావడంతో ప్రజారవాణాకు తీవ్రనష్టం వాటిల్లింది. ఈ బ్రిడ్జి గుండా రాకపోకలను నిషేదిస్తూ నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు రెండు వైపులా గోడలు కట్టారు. వేసవి కాలంలో వాగులో నీటి ప్రవాహం ఎక్కువగా లేకపోవడంతో అధికారులు తాత్కాలిక వంతెన ఏర్పాటు చేసి ఎలాగోలా రాకపోకలు పునరుద్ధరించారు. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తాత్కాలిక వంతెన పూర్తిగా కొట్టుకుపోవడంతో రవాణా కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. దీంతో ప్రమాదమని తెలిసిన కూడా ప్రజలు కాలినడకన ద్విచక్ర వాహనాలపై ఈ బ్రిడ్జి గుండా రాకపోకలు నిర్వహిస్తున్నారు.

జోగుఫౌండేషన్ ఆధ్వర్యంలో జోరుగా పనులు...

జైనథ్–బేల మధ్య విస్తరించి ఉన్న 353–బీ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా తరోడ వద్ద కొత్త బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఇటీవలే నిధులు విడుదల చేయడంతో పాటు టెండర్లు కూడా పిలిచింది. ఈ పనులు పూర్తి కావడానికి సమయం పట్టే అవకాశం ఉండటంతో జోగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాదాపు రూ.40లక్షలతో తాత్కాలిక వంతెన నిర్మిస్తున్నారు. తరోడ వాగుపై కాంక్రీట్ బెర్త్ ఏర్పాటు చేసి, దానిపై సిమెంట్ పైప్‌లను అమర్చి తాత్కాలిక వంతెన నిర్మాణానికి పనులు జోరుగా కొనసాగుతున్నాయి. దాదాపు 120–10 సిమెంట్ పైప్‌లను వంతెన కోసం వాడుతున్నారు. వంతెన పనులు చేపడుతుండడంతో ఆయా మండల వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పెళ్లయిన నాలుగు నెలలకే కడతేర్చాడు

- 20 నిమిషాలకే రోడ్డు ప్రమాదంలో నిందితుడు దుర్మరణం
- అనుమానంతో భార్యను హత్య చేసిన భర్త
- ఆదిలాబాద్ జిల్లా బంగారుగూడలో ఘటన
- ఇరు కుటుంబాల్లో విషాదం



సంఘటన స్థలంలో అరుణ్ మృతదేహం

ఆదిలాబాద్‌రూరల్: పెళ్లైన నాలుగు నెలలకే ఆ సంసారంలో అనుమానం పెనుభూతంగా మారింది. మూడు ముళ్లు.. ఏడు అడుగులు వేసి చివరి వరకూ తోడుగా ఉంటానని బాస చేసిన భర్తే.. అతికిరాతకంగా భార్యను హత్య చేశాడు. ఆపై పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోవడానికి వెళ్తూ.. ఆగి ఉన్న లారీని ఢీకొని దుర్మరణం చెందాడు. ఈ విషాద సంఘటనలు ఆదిలాబాద్ జిల్లా బంగారుగూడలో జరిగాయి. ఆ రెండు కుటుంబాలకు తీరని శోకాన్ని మిగిల్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆదిలాబాద్ పట్టణానికి సమీపంలోని బంగారుగూడకు చెందిన జయవంత్‌రావు–పద్మ దంపతులకు ఏకైక కుమారుడు మోహితే అరుణ్(30)కు నిజామాబాద్ జిల్లా బాల్కొండకు చెందిన గోపిచంద్–లక్ష్మి దంపతుల చిన్న కూతురు దీప(22)తో నాలుగు నెలల క్రితం వివాహం చేశారు. దీప తల్లిదండ్రులు కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. అష్టకష్టాలు పడి కూతురు వివాహం చేసి ఆనందపడ్డారు. పెళ్లయిన నాటి నుంచి భార్యపై అరుణ్ అనుమానం పెంచుకున్నాడు. ఈ విషయంలో ఇరువురి మధ్య గొడవలు జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఆషాఢమాసం కావడం, భార్య పుట్టింటికి వెళ్లి నాలుగు రోజుల క్రితమే తిరిగి అత్తింటికి వచ్చింది. భార్యపై కక్ష్య పెంచుకున్న అరుణ్ శుక్రవారం తెల్లవారుజామున దీప తలను మంచానికి బాది అత్యంత కిరాతకంగా హత్య చేశాడు.

లొంగిపోదామని..

అనంతరం పోలీసుల ఎదుట లొంగిపోవడానికి ఆదిలాబాద్‌రూరల్ పోలీస్‌స్టేషన్‌కు బైక్‌పై బయలుదేరాడు. అరుణ్ తల్లిదండ్రులు పద్మ, జయవంత్‌రావు విగతజీవిగా పడి ఉన్న కోడలును చూసి ఆందోళనకు గురయ్యారు. కొడుకు ఇంటి వద్ద కనిపించకపోవడంతో ఫోన్ చేశారు. రూరల్‌పోలీస్ స్టేషన్ వైపు వెళ్తున్నట్లు ఫోన్‌లో చెప్పగా వెంటనే తిరిగి ఇంటికి రావాలని కోరారు. దీంతో అతడు బైక్‌పై ఇంటికి వస్తున్న క్రమంలో ఆగి ఉన్న లారీని వెనక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. ఇంటికి తిరిగి వస్తాడనుకున్న కొడుకు మృతిచెందాడనే వార్త వినగానే తల్లిదండ్రులు మరింత షాక్‌కు గురయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు దీప ఇంటికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అలాగే అరుణ్ తల్లిదండ్రులను సైతం పోలీసులు విచారించగా కొన్నిరోజులుగా కుటుంబ కలహాలు ఉన్నాయని పోలీసులకు తెలిపారు. ఇదిలా ఉండగా కూతురు హత్యకు గురైన విషయాన్ని తెలుసుకున్న తల్లిదండ్రులు లక్ష్మి, గోపిచంద్ రిమ్స్ ఆస్పత్రికి చేరుకుని విలపించిన తీరు అక్కడి వారిని కదిలించింది. కాగా మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు అరుణ్ తల్లిదండ్రులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆదిలాబాద్‌రూరల్ ఎస్సై ముజాహిద్ వివరించారు. అలాగే అరుణ్ మృతికి కారణమైన లారీ ఓనర్‌పై ఆదిలాబాద్ పట్టణంలోని టూటౌన్‌లో కేసు నమోదైంది.

రెండో అంతస్తు నుంచి జారిపడిన విద్యార్థి..

- తప్పిన పెనుప్రమాదం..
- ఓ ప్రైవేట్ పాఠశాలలో ఘటన

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ వద్ద గల ఓ ప్రైవేట్ పాఠశాలలోని ఆరవ తరగతి విద్యార్థి చదువుతున్న విద్యార్థి రెండో అంతస్తు నుంచి శుక్రవారం ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. వివరాల ప్రకారం... సారంగాపూర్ మండలానికి చెందిన విద్యార్థి స్థానిక ఓ ప్రైవేట్ పాఠశాలలోని హాస్టల్‌లో ఉంటూ ఆరవ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం రెండవ అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడ్డాడు. వెంటనే అప్రమత్తమైన పాఠశాల సిబ్బంది విద్యార్థిని స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. వైద్యులు చికిత్స అందించి ఎలాంటి ప్రమాదం సంభవించలేదని తెలిపారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. విద్యార్థి స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా.? లేక విద్యార్థినే దూకాడా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ముగిసిన ట్రెయినీ ఐఏఎస్ అధికారుల పర్యటన



గిరిజనులతో ట్రెయినీ సర్వీసెస్ అధికారులు



గిరిజన పిల్లలతో ముచ్చటిస్తున్న ట్రెయినీ అధికారులు

సిరికొండ: ఐదు రోజుల నుంచి మండలంలోని రిమ్మ గ్రామంలో గిరిజనుల జీవన స్థితిగతులు, ఆచార వ్యవహారాలను ట్రెయినీ ఐఏఎస్ అధికారులు క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయగా శుక్రవారంతో ముగిసింది. వీరు గత ఆదివారం రిమ్మ గ్రామానికి చేరుకోగా గిరిజనుల జీవన స్థితిగతులుపై అధ్యయనం చేశారు. అధికారులకు గిరిజనులు ఆప్యాయతతో వీడ్కోలు పలికారు.

ఫ్రెషర్స్.. హుషారు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి ఆడిటోరియంలో 'లా ఫియెస్టా సావనీర్ 22' పేరిట మెడికల్ మొదటి సంవత్సరం విద్యార్థులు శుక్రవారం రాత్రి ఫ్రెషర్స్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ భాగస్వాములు కావాలని సూచించారు. ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా మానసిక ఉల్లాసం కోసం ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహద పడతాయని అన్నారు. సీనియర్, జూనియర్ అనే తేడా లేకుండా స్నేహభావంతో మెలగాలని కోరారు. రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్ పాల్గొన్నారు.



కేరింతలు కొడుతున్న విద్యార్థులు



నృత్యం చేస్తున్న మెడికో విద్యార్థినులు